విరిగిన 'భగీరథ' రెయిలింగ్

- ప్రమాదకరంగా వాటర్‌ట్యాంక్
- భయంభయంగా శుభ్రం చేస్తున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు, పాలకులు



తాడిచర్ల పెంజెరువు వద్ద రెయిలింగ్ విరిగిన వాటర్ ట్యాంకు

మల్హర్ : మిషన్ భగీరథ వ్యాటర్ ట్యాంక్‌తో ప్రమాదం పొంచిఉంది. రెయిలింగ్ విరగడంతో ట్యాంక్ ఎక్కేందుకు పంచాయతీ సిబ్బంది జంకుతున్నారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీల్లో 56 మిషన్ భగీరథ ట్యాంకులు వినియోగంలో ఉన్నాయి. అయితే పలుచోట్ల వాటర్ ట్యాంకుల రెయిలింగ్‌లు (మెట్లు) విరిగి ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో వాటర్ ట్యాంకులు శుభ్ర చేసేందుకు ట్యాంకు పైకి ఎక్కాలంటే పంచాయతీ సిబ్బంది భయపడుతున్నారు. తాడిచర్ల, మల్లారం, ఇప్పలపల్లి, అన్సాన్‌పల్లి, పెద్దతూండ్ల తదితర గ్రామాల్లోని ట్యాంకులు ప్రమాదకరంగా ఉన్నట్లు సమాచారం. ప్రతి 10నుంచి 15 రోజులకు ఒక్కసారి 60 నుంచి 70మీటర్ల ఎత్తులో ఉన్న ట్యాంకులను పంచాయతీ సిబ్బంది ఎక్కి ట్యాంకు లోపల బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేస్తారు. రెయిలింగ్ విరిగిన ట్యాంకులను శుభ్రం చేయాలంటే పంచాయతీ సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకోని పని చేయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ట్యాంకులు ఎక్కేటప్పుడు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్న ట్యాంకు మీద నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని కార్మికులు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్యాంకులకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

మెట్లు ఏర్పాటు చేయాలి



తాడిచర్ల పెంజెరువు వద్ద మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు రెయిలింగ్ విరిగి ప్రమాదకరంగా ఉంది. ట్యాంకు ఎక్కి శుభ్రం చేయాలంటే భయభయంగా ఉంటుంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ట్యాంకు ఎక్కి శుభ్రం చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ట్యాంకుకు రెయిలింగ్ (మెట్లు) నిర్మించాలి

– రామస్వామి, పంచాయతీ కార్మికుడు

రేపు కలెక్టరేట్ ముట్టడి



సమావేశంలో మాట్లాడుతున్న సంపత్

మొగుళ్లపల్లి : మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 13న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ రేణుకుంట్ల సంపత్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిచేయడం దళిత జాతిపై దాడి చేయడం అని మండిపడ్డారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని చట్టపరమైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ఈ నెల 13వ తేదీన భూపాలపల్లిలో కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలనుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనాలని కోరురు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, సారంగపాణి, జీడి సంపత్, మంగళపెల్లి శ్రీనివాస్,మొగిలి తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి

కాటారం : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో కోరారు. దాడికి పాల్పడిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చలో కలెక్టరేట్ కార్యక్రమానికి మండలంలోని దళిత సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని చిరంజీవి పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని

చిట్యాల : పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద పేర్కొన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా శనివారం చిట్యాల ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో చేపట్టిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అలాగే కేజీబీవీలో విద్యార్థులకు అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సంధ్యారాణి, భాగ్యలక్ష్మి, ఉమ, సుజాత, భాగ్యమ్మ, అరుణ, జ్యోతి, ఆశ వర్కర్, మహిళలు రజిత, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉచ్చులకు అడవిపంది బలి

కాటారం : పంటలను కాపాడుకోవడానికి పలువురు రైతులు అమర్చిన విద్యుత్ ఉచ్చులకు అడవిపంది తాకి మృతిచెందిన సంఘటన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తనిఖీ చేయగా శనివారం వెలుగులోకి వచ్చింది. విద్యుత్ శాఖ లైన్‌మెన్ ప్రవీణ్ తెలిపిన కథనం ప్రకారం.. గూడురు 11 కేవీ ఫీడర్ పరిధిలో తరుచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. ఇదే క్రమంలో శుక్రవారం రాత్రి 11కేవీ లైన్ ట్రిప్ కావడంతో పలువురు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో లైన్‌మెన్, విద్యుత్ సిబ్బంది ధన్వాడ విద్యుత్ లైన్ నుంచి తనిఖీలు చేపట్టారు. ధన్వాడ–గుమ్మాళ్లపల్లి రహదారి పక్కన పొలం వద్ద తీగ తగిలించి ఉండగా లోపలికి వెళ్లి పరిశీలించారు. విద్యుత్ తీగ ఉచ్చుకు ఓ అడవిపంది మృతి చెంది ఉన్నట్లు లైన్‌మెన్, సిబ్బంది గుర్తించారు. విద్యుత్ ఉచ్చు తీగలను తొలగించిన సిబ్బంది విద్యుత్‌ను పునరుద్ధరించారు. పోలీసులకు, విద్యుత్ అధికారులకు సిబ్బంది సమచారం ఇచ్చి శనివారం వెళ్లి చూడగా అడవిపంది కళేబారం సంఘటన స్థలంలో కనిపించలేదు. విద్యుత్ ఉచ్చు అమర్చిన వారే కళేబారం తొలగించి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏటూరునాగారం : మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేడు (ఆదివారం) ఉదయం 8నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

పరామర్శ

వెంకటాపురం(ఎం) : మండల కేంద్రానికి చెందిన అన్నెబోయిన సరోజన, బానోత్ రమ శనివారం మృతిచెందారు. బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మేడబోయిన అశోక్, సాద యాదగిరి, గద్దమీది దేవేందర్, ఎండీ.రహీమొద్దీన్, మాజీ మేడారం ట్రస్టు డైరెక్టర్ చంటి భద్రయ్య, మాజీ ఎంపీటీసీలు దగ్గు ప్రభాకర్‌రావు, గాజుల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు నర్రా భద్రయ్య, రామిండ్ల రాజేందర్, శెట్టి శ్రీధర్, రవి, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఎస్‌ఎస్‌తాడ్వాయి : మేడారం సమీపంలోని రెడ్డిగూడెం కాలనీకి చెందిన విద్యార్థి లక్ష్మీరాజు ఎంబీబీఎస్ సీటు సాధించాడు. కాగా శనివారం మేడారం సమ్మక్క పూజారి సిద్దబోయిన స్వామి కుమారులు రోహిత్, రుతిక్‌ల రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. విద్యార్థి లక్ష్మీరాజు ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఖర్చుల నిమిత్తం సాయం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి, నాయకపోడు జిల్లా అధ్యక్షుడు గుండ్ల రాజు, సాంబశివరావు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



ములుగు : విద్యా హక్కు, బాలకార్మికుల చట్టాలపై విద్యార్థులు అవగాహన ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలికలకు బాల్య వివాహ చట్టాలు, ఆడపిల్లలపై జరుగుతున్న వివక్షపై అవగాహన కల్పించి ఉచిత న్యాయ సలహా ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, ఉపాధ్యాయులు రమ, సుకన్య, శ్రీహిత పాల్గొన్నారు.

అత్యవసర మందులు ఉంచుకోవాలి



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న రాజునాయక్

మొగుళ్లపల్లి : అత్యవసర మందులను అంబులెన్స్‌లో నిరంతరం అందుబాటులో ఉంచుకోవాలని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని 108 జిల్లా మేనేజర్ రాజు నాయక్ సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని 108వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అత్యవసర సమయంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందిచడం ద్వారా వారి ప్రాణాలని కాపాడిన వారం అవుతామని సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వైద్యసేవలను అందిచాలని కోరారు. బాధితులను వైద్యశాలకు చేర్చడంలో 108 సిబ్బంది కీలకంగా వ్యహరించాలని ప్రజలకు వైద్యం అందిచడానికి కృషి చేయాలని సూచించారు. వాహనంలో సమస్యలు లేకుండా నిత్యం తనిఖీలు చేయాలని ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సంబధింత అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ రాజు, పైలెట్ శీను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్

మొగుళ్లపల్లి : కేంద్ర ప్రభుత్వం తొమ్మిదో షెడ్యూల్ బీసీ రిజర్వేషన్లను చేరిస్తే న్యాయపరమైన అవరోధాలు ఉండేవి కావని, బీసీ రిజర్వేషన్ల చట్టానికి గవర్నర్ ఆమోదం తెలిపి ఉంటే హైకోర్టులో స్టే వచ్చేది కాదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అభిప్రాయపడ్డారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన నిర్వహించి, బీసీ రిజర్వేషన్లను పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేయడం రాష్ట్ర ప్రభుత్వం చేసిన నేరమా..? అని బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్సుపై ఇప్పటిదాకా గవర్నర్ సంతకం పెట్టకుండా తాత్సారం చేస్తే..విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. బీసీ రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలన్నీ డ్రామాలాడుతున్నాయని అన్నారు, ఒక పార్టీ మీద ఇంకొక పార్టీ నెపం నెట్టడమే తప్ప.. బీసీలకు నిజమైన మద్దతు ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు కింది నుంచి పై కోర్టుల వరకు బీసీ రిజర్వేషన్లు పెంచిన ప్రతిసారి కోర్టులను వేదికగా చేసుకుని రిజర్వేషన్ వ్యతిరేకులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కోర్టులు కూడా బీసీలకు న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత దక్కడానికి మొదటి నుంచి బీసీ సమాజమంతా తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నదెవరో.. బీసీలను రాజకీయంగా వాడుకుంటున్నదెవరో ప్రజలు గమనిస్తున్నారన్నారని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర కుల గణన నిర్వహించి. .బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తానంటే..బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు కడుపు మండుతోందని దుయ్య బట్టారు ఇకనైనా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పార్టీలు డ్రామాలు ఆపి బీసీ రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమాజసేవకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రాధాన్యం



సంఘ ప్రార్థన చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

రేగొండ : సమాజసేవకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రాధాన్యత నిస్తోందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ బుర్ర సదయ్య అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం మండల కేంద్రంలో పదసంచలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశభక్తిని పెంపొందించడంలో ఆర్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర వహిస్తోందన్నారు. క్రమశిక్షణ, సేవాభావాన్ని విస్తరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌కు యువత ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. దేశాభివృద్ధి, హిందువుల పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఖండ కార్యవాహ విజన్ రావు, ఖండ శారీరక ప్రముఖ్ సురేందర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి, పెండల రాజు, పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాదరావు, నాయకులు తిరుపతిరెడ్డి, లింగారెడ్డి, బుచ్చిరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ



పొలంలో మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

రేగొండ : వ్యవసాయంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు పొలం దున్నడం, విత్తనాలు వేయడం, కలుపు తీయడం, కోత వంటి పనులన్నీ శారీరక శ్రమ ద్వారా జరిగేవి. ప్రస్తుతం వ్యవసాయంలో రైతులు ట్రాక్టర్లు, ఇతర యంత్రాలను విరివిగా వాడుతున్నారు. కొంత మంది రైతులు డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ పొలంలో డ్రోన్ సాయంతో పురుగుల మందు పిచికారీ చేయించారు. డ్రోన్ వాడకంతో మందు వృధా కాదని, కూలీల కొరత తగ్గించవచ్చని, సమయం, డబ్బు ఆదా అవుతాయని పేర్కొంటున్నారు. ఎకరం పొలంలో మందు స్ప్రే చేయడానికి రూ.500 వరకు ఖర్చు అవుతుందని తెలిపారు.

గుంతలు పూడ్చాలని నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

కాటారం : కాటారం–మంథని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసి మరమ్మతులు చేపట్టాలని శనివారం సీపీఎం, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు రోడ్డుపై గుంతల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. నాలుగు లేన్ రోడ్డు నిర్మించిన కొద్దిరోజుల్లోనే నాణ్యత లోపించి గుంతలమయంగా మారిందని ఆరోపించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతోనే నాసిరకం పనులు కొనసాగాయని పేర్కొన్నారు. రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు పంతకాని సడువలి, రామిళ్ల రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నం అమానుషం



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న రాజయ్య



మొగుళ్లపల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



కాళేశ్వరం: మహదేవపూర్‌లో మాట్లాడుతున్న సురేష్, తిరుపతి

భూపాలపల్లి రూరల్ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నం అమానుషమని, తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుగుంట్ల మహేష్, ప్రధాన కార్యదర్శి పుల్లా సతీష్, కార్యదర్శి బచ్చల చిరంజీవి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్, మల్హర్ మండల అధ్యక్షుడు మంత్రి రాజబాబు తదితరులు పాల్గొన్నారు. జిల్లా ప్రచార కార్యదర్శి రాజేందర్, నాయకులు వంతడుపుల సారంగపాణి, జీడి సంపత్, బండారి రాజు, కుమార్, భిక్షపతి, రాజయ్య, పాపయ్య, చెరిపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి

మొగుళ్లపల్లి : సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిచేసిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మంగళపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. సుప్రీం కోర్టులో జస్టిస్ గవాయ్‌పై అడ్వకేట్ రాకేష్ కిషోర్ దాడికి ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి డిమాండ్ చేశారు.

దాడి సిగ్గుచేటు

కాళేశ్వరం : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి సిగ్గుచేటని ఎమ్మార్పీఎస్ మహదేవపూర్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ అన్నారు. శనివారం మహదేవపూర్‌లోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసే సమయంలో ఆయన చూపిన ధైర్యం గొప్పదని కేవలం వ్యక్తిగతంగా ఒక వర్గం దాడి చేసినట్టుగానే భావిస్తామని ఇప్పటికైనా అధికారులు నిందితుడిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 13న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. బీసీ సంఘాల నాయకులు సముద్రాల తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు చింతకుంట సదానందం, ఉపాధ్యక్షుడు కొలుగురి శ్రీకాంత్, ఎమ్మార్పీఎస్ నాయకులు లింగాల సాగర్, బెల్లంపల్లి ప్రవీణ్, ఇనుగాల ప్రవీణ్, బీసీ నాయకులు రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి పూజ



పూజలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో శనివారం ఎల్లమ్మ గుడి నిర్మాణానికి తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షుడు వేముల మొగిలి గౌడ్, భూపాలపల్లి సీఐ నరేష్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎల్లమ్మ గుడి కమిటీ చైర్మన్ పబ్బ దామోదర్ గౌడ్, వైస్ చైర్మన్ శ్రీపతి తిరుపతి, కార్యదర్శి వేముల రాజేందర్,ఎసభ్యుల శ్రీనివాస్‌చ కంకటి రాజవీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న స్కార్పియో

- ప్రమాదంలో ఒకరికి గాయాలు



పొలాల్లోకి దూసుకెళ్లిన ఆటో

గణపురం : మండలంలోని చెల్పూరు కేటీపీపీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. భూపాలపల్లి నుంచి గాంధీనగర్ వైపు వస్తున్న ఆటోను స్కార్పియో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో రోడ్డుపై నుంచి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆటో డ్రైవర్‌కు గాయలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణికులు ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

పోలీసులపై పొలిటికల్ ఫైట్..

- నిస్సహాయ స్థితిలో ఖాకీలు
- ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి

టేకుమట్ల : శాంతిభద్రతల రక్షణకు నిత్యం గ్రామాల్లో పోలీసులు పహారా కాస్తున్నారు. అలాంటి పోలీసులకే రక్షణ లేక నిస్సహాయ స్థితిలో రాజకీయ నాయకుల పలుకుబడికి లోబడి పనిచేస్తూ తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పొలిటికల్ లీడర్ల దురుసు ప్రవర్తనతో తీవ్ర మానసిక వేదనతో ఎవరికి చెప్పుకోలేక కుమిలిపోతున్న సంఘటనలు ఎన్నో..

ఉదాహరణలు కొన్ని..

- మండలంలోని రామకృష్ణాపూర్ (వి)లో సద్దుల బతుకమ్మ సందర్భంగా విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ పై అదే గ్రామానికి చెందిన ఆకతాయి ఉమ్మి వేయడంతో ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఎవరికి చెప్పుకోలేక కానిస్టేబుల్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు.
- ఇటీవల విధుల్లో ఉన్న మరో హెడ్ కానిస్టేబుల్ ఓ కేసు విషయంపై మండలంలోని పెద్దంపల్లికి విచారణలో భాగంగా వెళ్లాడు. కాగా అదే గ్రామానికి చెందిన యువకుడు బూతులు తిడుతూ అవహేళన చేశాడు. దీంతో చేసేది ఏమి లేక కానిస్టేబుల్ వెనుదిరిగి వచ్చాడు.
- శుక్రవారం ఉదయం చలివాగు వద్ద విధుల్లో ఉన్న హోంగార్డుని అధికార పార్టీకి చెందిన ఓ మాజీ ప్రజా ప్రతినిధి, మరికొందరు ఇక్కడ నువ్వు చేస్తున్న డ్యూటీ ఏంటి అంటూ హేళన చేసి, ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.
- పోలీసులను దుర్భాషలాడడం, దాడికి యత్నించడం వంటి జరుగుతున్నా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం పోలీసులకే భద్రత లేకుండా ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి అంటూ పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఎస్‌ఓ, పీఈటీ

టేకుమట్ల : జిల్లా కేంద్రంలో 69వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అండర్–14, 17 కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌ఓ నాగపూరి స్వప్న శనివారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రిషిత, అంజలీకి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్రీడల పట్ల ఆసక్తి గల పిల్లలను ప్రోత్సహిస్తూ ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. భవిష్యత్‌లో క్రీడల్లో మరింత ప్రోత్సాహాన్ని అందించి జాతీయ స్థాయికి ఎదిగేలా కృషి చేస్తామన్నారు. ఆమె వెంట పీఈటీ అనిత ఉన్నారు.

గల్లంతైన పవన్ మృతదేహం లభ్యం

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని బీరెల్లి ఊర చెరువులో స్నానానికి వెళ్లి గల్లంతైన మంకిడి పవన్ మృతదేహం శనివారం లభ్యమైంది. శుక్రవారం బీరెల్లికి చెందిన బాసాని చిన్నకృష్ణ దహన సంస్కారాలకు పవన్ వెళ్లాడు. అనంతరం చెరువులో స్నానం చేసేందుకు తూము వద్ద దిగి, ఈత కొడుతూ రోడ్డు వైపు వస్తుండగా గల్లంతయ్యాడు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టడంతో పవన్ మృతదేహం లభ్యమైంది. తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కాగా పవన్ చెరువులో గల్లంతై మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబ సభ్యులను మంత్రి సీతక్క పరామర్శించి తల్లిదండ్రులను ఓదార్చారు.

నిర్లక్ష్యం వీడేదెప్పుడు?



మెయిన్‌ఘాటు వద్ద తొలగించిన లైట్



శ్రాద్ధకర్మ మండపం వద్ద నిర్మించిన హైమాస్ట్ లైటు స్తంభం

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల సమయంలో మెయిన్‌ఘాటు వద్ద ఎండోమెంట్ ఆధ్వర్యంలో నిర్మించిన స్వాగత తోరణం(ఆర్చ్) హైమాస్ట్ లైట్ స్తంభంతోనే స్లాబు వేశారు. అయితే సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించారు. ప్రస్తుతం వీఐపీ ఘాటులోని శ్రాద్ధకర్మ మండపం వద్ద భవనానికి అనుకొని విద్యుత్ దీపంతోనే మళ్లీ స్తంభం నిర్మించారు. అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా ప్రజాధనం దుర్వినియోగంగా మారుతోందని ఆరోపణలున్నాయి.